# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 18 మే 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 318

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




-3లో

రాజస్థాన్ రాయల్స్‌కు హ్యాట్రిక్ ఓటమి



-2లో

## కేంద్రమే డబ్బులు ఇస్తుంటే ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందేంటి?

**‘సర్’పై రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ఉద్యోగుల మీద నమ్మకం లేదేమో!**

**బండి భగీరథ్ కేసులో కేంద్ర ప్రమేయం ఉండదు**



## ‘సరస్వతి’ అంత్య పుష్కరాలకు రావాలని సీఎంకు ఆహ్వానం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈ నెల 21 నుంచి ప్రారంభంకానున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలకు హాజరవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దేవాదాయశాఖ ఆహ్వానించింది. మంత్రి కొండా సురేఖ, ఆలయ అర్చకులు సీఎంను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు, శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామి దేవస్థానం ఈవో మహేశ్ పాల్గొన్నారు.

## నెదర్లాండ్స్, స్వీడన్‌లతో వ్యూహాత్మక బంధం



**రక్షణ, విలువైన ఖనిజాలవంటి రంగాలపై ఒప్పందాలు**

**భారత ప్రధాని సమక్షంలో సంతకాలు**

ప్రపంచ భౌగోళిక రాజకీయాలు మారిపోతున్న తరుణంలో నెదర్లాండ్స్, స్వీడన్‌లతో తమ భాగస్వామ్య బంధాన్ని వ్యూహాత్మక స్థాయికి తీసుకువెళ్లాలని భారత్ నిర్ణయించింది. రక్షణ, విలువైన ఖనిజాలు, ఇతర కీలక రంగాల్లో నెదర్లాండ్స్‌తో 17 ఒప్పందాలపై ఇరు దేశాలూ సంతకాలు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెటెన్‌ల సమక్షంలో ఇవి కుదిరాయి. ఐరోపా పర్యటనలో భాగంగా శనివారం రాత్రి జెటెన్‌తో మోదీ భేటీ అయినప్పుడు ఇరువురు నేతలూ పశ్చిమాసియాలో పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రపంచ ఇంధన రంగానికి ఎదురవుతున్న అవాంతరాలు, వాణిజ్య వ్యవస్థలు దెబ్బతినడం వంటివాటిపై సమాలోచనలు జరిపారు. హర్మూజ్ జలసంధి మీదుగా నౌకాయానానికి అడ్డంకులవల్ల ఉత్పన్నమైన పరిస్థితిపై కలవరం వ్యక్తం చేశారు. నౌకాయాన స్వేచ్ఛ ఉండాలని, ఎలాంటి నియంత్రణలు ఉండకూడదని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ దిశగా జరుగుతున్న ప్రయత్నాలకు పూర్తి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ చట్టాలకు తగ్గట్టు ఉక్రెయిన్‌లో శాంతిస్థాపన జరగాలని ఆకాంక్షించారు. ఇరు దేశాల బంధాలకు కొత్త ఊపు

మోదీ సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ.. తన పర్యటనతో భారత్, నెదర్లాండ్స్ మధ్య సంబంధాలకు కొత్తఊపు లభించినట్లయిందన్నారు. ఉద్యోగం, విద్య కోసం భారతీయులు నెదర్లాండ్స్‌కు వచ్చేందుకు వీలు కల్పించే ఒప్పందం కూడా కుదిరింది. మోదీ, జెటెన్ కలిసి చరిత్రాత్మక అఫ్‌స్లుట్డిక్ జలాశయంలో కాసేపు విహరించారు. భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ క్షీణిస్తోందని, మైనారిటీల హక్కులు హరించుకుపోతున్నాయని డచ్ ప్రధాని రాబ్ జెటెన్ చేసినట్లు వచ్చిన ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది.




**రాష్ట్ర చరిత్రలో తొలిసారి**

**156.63 మార్కులతో మొదటి స్థానంలో రుషి**

**ఎప్‌సెట్-2026 ఫలితాలు విడుదల**

**అగ్రికల్చర్‌లో 150.17 మార్కులతో అహ్మద్‌కు ప్రథమ ర్యాంకు**

**ఇంజినీరింగ్‌లో 73.36%, అగ్రికల్చర్‌లో 86.27% ఉత్తీర్ణత**

## ఇంజినీరింగ్ టాపర్ అమ్మాయే

హైదరాబాద్: తెలంగాణ ఎప్‌సెట్–2026 ఇంజినీరింగ్ విభాగంలో తొలిసారిగా అమ్మాయి ప్రథమ ర్యాంకు సాధించి చరిత్ర సృష్టించింది. మేడ్చల్ జిల్లా ఉప్పల్ ప్రాంతానికి చెందిన మల్లాడి రుషి 160కి 156.63 మార్కులు సాధించి ఫస్ట్ ర్యాంకు కైవసం చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇంజినీరింగ్ విభాగంలో అమ్మాయి తొలి ర్యాంకు సాధించడం ఇదే తొలిసారి. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఆనాటి ఎంసెట్‌లో అమ్మాయిలకు ప్రథమ ర్యాంకు దక్కిన సందర్భం లేదని ఎప్‌సెట్ అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో గతంలో మెడికల్ విభాగం, ఇప్పుడు అగ్రికల్చర్–ఫార్మసీలో మాత్రం ఎక్కువ సార్లు అమ్మాయిలు ప్రథమ ర్యాంకు దక్కించుకుంటున్నట్లు తెలిపారు. అగ్రికల్చర్–ఫార్మా విభాగంలో హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌కు చెందిన ముఖరం అహ్మద్ 150.17 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించాడు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్- ఎప్‌సెట్-2026)కు సంబంధించి

ఇంజినీరింగ్ విభాగంలో 73.36 శాతం.. అగ్రికల్చర్–ఫార్మా విభాగంలో 86.27 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈసారి ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత శాతం స్వల్పంగా పెరగ్గా.. అగ్రికల్చర్ విభాగంలో స్వల్పంగా తగ్గింది. ఇంజినీరింగ్‌లో తొలి పది ర్యాంకర్లలో ఎనిమిది, అగ్రికల్చర్ విభాగంలో ఏడుగురు అబ్బాయిలే నిలిచారు.



**ఉత్తీర్ణతలో అమ్మాయిలదే పైచేయి..టాప్-10 ర్యాంకర్లలో అబ్బాయిలు అధికంగా ఉండగా కనీస మార్కులు సాధించి ఉత్తీర్ణులు కావడంలో అమ్మాయిలు పైచేయి సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో అబ్బాయిలు, అమ్మాయిల ఉత్తీర్ణత శాతాలు వరుసగా 73.10, 73.72గా ఉన్నాయి. అగ్రికల్చర్ విభాగంలో అబ్బాయిలు 84.70 శాతం, అమ్మాయిలు 86.76 శాతం మంది పాసయ్యారు. ఇంజినీరింగ్ కంటే అగ్రికల్చర్‌లో ఉత్తీర్ణత ఏకంగా 13 శాతం అధికంగా ఉండటం విశేషం. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఆచార్య ఇటిక్యాల పురుషోత్తం, మహమూద్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి, ఆచార్య శ్రీరాం వెంకటేష్, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ఆచార్య కె.వెంకటేశ్వర్‌రావు, కో కన్వీనర్ బాలూనాయక్ పాల్గొన్నారు.**

**కాంగ్రెస్, భాజపా.. బాలికకు అన్యాయం చేయాలని చూశాయి**

**వచ్చే మా ప్రభుత్వంలో నగరంలో 24 గంటలూ తాగునీటి సరఫరా: కేటీఆర్**



## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాలి

ఎల్బీనగర్: కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. వేధింపులకు గురైన బాలికకు కాంగ్రెస్, భాజపాలు కలిసి అన్యాయం చేయాలని చూశాయని ఆరోపించారు. హైదరాబాద్ ఎల్బీనగర్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ‘నా బూత్.. నా భవిష్యత్తు’ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ‘బాలికకు అన్యాయం జరిగితే ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఆమెకు న్యాయం చేసేందుకు భారాస పోరాడింది. ప్రధాన మంత్రి బేటీ బచావో.. బేటీ పఢావో అంటున్నారే తప్ప బాలికకు న్యాయం చేయడం లేదు. కేంద్ర మంత్రి కుమారుడికే లుకౌట్ నోటీసులు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయకుంటే విచారణ సరిగా జరగదు. బాలిక తల్లిదండ్రులను పిలిచి ఆయన బెదిరింపులకు పాల్పడ్డారు. ఎన్ని రకాలుగా ఒత్తిళ్లకు గురిచేసినా అమ్మాయికి న్యాయం చేయాలని ఆమె తల్లిదండ్రులు చేసిన పోరాటం గొప్పది. ఇంత తీవ్రమైన కేసును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీరుగార్చే ప్రయత్నం చేశారు. నగరంలో నలువైపులా టిమ్స్ ఆసుపత్రులను నిర్మించింది భారాస ప్రభుత్వమే. ఇప్పటి వరకు ఎల్బీనగర్‌లో టిమ్స్ నిర్మాణం పూర్తి కాలేదు. దాని ముందు ధర్నా చేస్తాం. 2028లో వచ్చే భారాస ప్రభుత్వం నగరంలో ఇంటింటికీ 24 గంటలూ తాగునీరు సరఫరా చేస్తుంది. జూన్‌లో సభ్యత్వ నమోదు, జులైలో డివిజన్ కమిటీలు ఏర్పాటు చేస్తాం. ‘సర్’లో బిహార్‌లో 60 లక్షలు, పశ్చిమబెంగాల్‌లో కోటి మంది ఓటర్లను తొలగించారు. నగరంలో మైనారిటీ ఓటర్లకు పార్టీ శ్రేణులు అండగా ఉండాలి’ అని కేటీఆర్ సూచించారు. సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాజయ్య, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎబోలాపై ఆరోగ్య అత్యవసర స్థితి

అబుజా: ఆఫ్రికా ఖండంలోని కాంగోలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ఇప్పటికే ఈ ప్రాణాంతక వ్యాధి సోకి 88 మంది మృతి చెందారు. మరో 300 మందికిపైగా ప్రజలు ఈ వైరస్ బారిన పడినట్లు అధికారులు తెలిపారు. పొరుగునున్న ఉగాండాలోనూ ఈ వైరస్ ఆనవాళ్లు బయటపడ్డాయి. దీంతో కాంగో, ఉగాండాలో ఆరోగ్య అత్యవసర స్థితిని విధిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించింది. దీనివల్ల తక్షణ ముప్పు లేకపోయినా.. కాంగో పొరుగు దేశాల్లో వేగంగా వ్యాపించే ప్రమాదముందని హెచ్చరించింది. 1976లో కాంగోలో ఎబోలాను తొలిసారిగా గుర్తించినప్పటి నుంచి ఇది వ్యాప్తిచెందడం 17వసారి అని వెల్లడించింది. అధిక పాజిటివిటీ రేటు.. వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళనకరంగా మారింది. జాతీయ విపత్తు యంత్రాంగాలను క్రియాశీలం చేయాలని, సరిహద్దుల వెంబడి స్క్రీనింగ్ చేపట్టాలని ప్రపంచ దేశాలకు డబ్ల్యూహెచ్‌వో సూచించింది.



# కేంద్రమే డబ్బులు ఇస్తుంటే ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందేంటి?

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వరికి కనీస మద్దతు ధర పెంచినా.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 'సర్'పై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. యుద్ధం వల్ల ఇంధనం ధరలు పెరిగితే అప్రజాస్వామికమని సీఎం ఆరోపించడం సరైంది కాదన్నారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చి మోసం చేసింది. రాష్ట్రంలో కనీసం ధాన్యం కొనలేని పరిస్థితి నెలకొంది. రైతులు అనేక ప్రాంతాల్లో ఆందోళనలు చేస్తున్నారు. యూపీఏ హయాంలో ధాన్యం క్వింటాకు రూ.1,300 గిట్టుబాటు ధర ఉండేది. మోదీ ప్రభుత్వం దాన్ని రూ.2,360కు పెంచింది. ధాన్యం కొనుగోలుకు ప్రతి పైసా కేంద్రమే ఇస్తుంది. రాష్ట్రంపై రూపాయి కూడా భారం పడదు. మొత్తం కేంద్రమే భరిస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లు ఎందుకు ఆలస్యం చేస్తుందో చెప్పాలి. రేవంత్‌రెడ్డి సర్కారు ధాన్యం మీద బోనస్ అని చెప్పి మాట తప్పింది. రాష్ట్ర మంత్రులంతా ఒక్కో జిల్లాకు వెళ్లి కొనుగోళ్లపై దృష్టి పెట్టి రైతుల ఇబ్బందులు తీర్చాలి.



అనర్హుల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు

ఇక స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) విషయానికొస్తే ఒక్కొక్కరికి రెండు లేదా మూడు చోట్ల ఓట్లు ఉంటే గుర్తించి తొలగిస్తారు. ముఖ్యంగా రోహింగ్యాల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు. 'సర్'పై రేవంత్‌రెడ్డి అనేక విమర్శలు చేస్తున్నారు. ఓట్ల ప్రక్షాళన మోదీ వచ్చి చేయరుగా.. రాష్ట్ర అధికారులే చేస్తారు. అయినా రేవంత్‌రెడ్డికి వారిపై విశ్వాసం లేదేమో. ఇటీవల ఒక సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఓట్లు తొలగిస్తోందని సీఎం రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారు. 'సర్' విషయంలో కేంద్రం కుట్రలు చేయాలని చూస్తోందని ఒక భారాస నేత ఆరోపించారు. అదేంటో బయట పెట్టాలని నేను సవాల్ చేస్తున్నా. పెట్రోల్, డీజిల్‌పై అప్రజాస్వామికంగా ధరలు పెంచారని సీఎం రేవంత్ మాట్లాడుతున్నారు. కానీ ఇది కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉన్న అంశం కాదు. గతంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధర తక్కువ ఉన్నప్పుడు ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం తగ్గించింది. రాష్ట్రాలను కూడా వ్యాట్ తగ్గించాలని కోరింది. మోదీ విజ్ఞప్తితో అనేక రాష్ట్రాలు తగ్గించాయి కూడా. దేశంలోనే అత్యధికంగా వ్యాట్ విధిస్తోంది తెలంగాణలోనే'
' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బండి భగీరథ్ కేసుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి బదులిస్తూ.. ఈ కేసులో కేంద్రం ప్రమేయం ఉండదని అన్నారు. రాష్ట్ర పోలీసులకు సంబంధించిన విషయమని, వారే దర్యాప్తు చేసి ఏ విషయమైనా చర్యలు తీసుకునే అధికారం ఉంటుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

## నిరుద్యోగులను విస్మరిస్తే మూల్యం తప్పదు: ఆర్.కృష్ణయ్య



బషీర్‌బాగ్: 'రాష్ట్రంలో నిరుద్యోగుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వారిని విస్మరిస్తూ తీవ్ర అన్యాయానికి గురి చేస్తోంది. ఇదే రకంగా వ్యవహరిస్తే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదు' అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆదివారం నిరుద్యోగ ఐకాస ఛైర్మన్ నీల వెంకటేశ్, ఏపీ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి ప్రసాద్‌ల అధ్యక్షతన బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిరుద్యోగుల సదస్సు నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 'రాష్ట్రంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు. సీఎం తన అధీనంలో ఉన్న విద్యా శాఖను గాలికి వదిలేశారు. పోలీసు శాఖలో 18 వేల ఖాళీలు, 30 వేల టీచర్ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు కార్యాచరణ చేపట్టాలి' అని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంజి ప్రసాద్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. సదస్సులో తెలంగాణ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు అంజి, జాతీయ కన్వీనర్ సి.రాజేందర్, తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జి.అనంతయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్, నేతలు పాల్గొన్నారు.

# విద్యార్థులను తీర్చిదిద్దే "గురుతర బాధ్యత గురువులదే".

**- విద్యా విజయోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్ వెల్లడి.**





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

చక్కటి విద్యా బుద్ధులు నేర్పించి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజులో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ..భావి భారత పౌరులైన విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత గురువులదేనన్నారు. అందుకే సమాజంలో గురువులకు ఎంతో గౌరవం, గొప్ప స్థానం ఉందని గుర్తు చేశారు. 2047 వరకు భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలనే ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పాన్ని సాకారం చేసేవిధంగా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. ఏ లక్ష్య సాధనకైనా చదువు ఎంతో తోడ్పాటును అందిస్తుందని చెప్పారు. విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్న ఫలితంగా ప్రైవేట్, కార్పోరేట్ స్కూల్స్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు నమోదు చేస్తున్నాయన్నారు. నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ బడుల విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనం అని పేర్కొన్నారు. అయితే విద్యార్థులు కేవలం మార్కుల సాధనకే పరిమితం కాకుండా, నాణ్యమైన విద్యను ఆర్జించాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, కలలను సాకారం చేసుకునే దిశగా నిజాయితీతో ముందుకు వెళ్లాలని మార్గనిర్దేశం చేశారు. భవిష్యత్తులో స్థిరపడేందుకు పదవ తరగతి తరువాత ఎంచుకునే మార్గం ఎంతో కీలకం అయినందున, ఇష్టమైన సబ్జెక్టులతో కూడిన కోర్సులలో చేరాలన్నారు. ఎంచుకున్న గమ్యాన్ని ఎలా చేరుకోవాలి అనే దానిపై స్పష్టత
కలిగి ఉండాలని, ఆ దిశగా అంకిత భావంతో కృషి చేస్తే తప్పకుండా లక్ష్యాన్ని చేరుకోగల్గుతారని అన్నారు. స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడకుండా పుస్తక పఠనంను అభిరుచిగా మల్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేశారు.
కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, డీఈవో అశోక్, బీ.సీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు నర్సయ్య, కృష్ణవేణి, జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎన్.పద్మశ్రీ, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, జీఈసీఓ భాగ్యలక్ష్మి, ఎం.ఈ.ఓలు, హెచ్.ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ పిలుపుతో... ఎలక్ట్రిక్ వాహనంలో అర్బన్ ఎమ్మెల్యే.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పెట్రోల్, డీజిల్ ఆదా చేయాలనే ఉద్దేశంతో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆదివారం ఈవీ (ఎలెక్ట్రిక్ వెహికల్ )లో ప్రయాణించారు. నగరంలోని పలు కార్యక్రమాలకు ఈవీ కారులోనే వెళ్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యుద్ధ వాతావరణ నేపథ్యంలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయని, వాటిని నియంత్రించేందుకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారని చెప్పారు. భారతదేశం 85 శాతం పెట్రోల్ డీజిల్ లను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటామన్నారు. కావున ఆర్థిక మాంద్యాన్ని ముందుగానే అంచనా వేసిన ప్రధాని మోదీ బంగారం, పెట్రోల్, డీజిల్, వంట నూనె తదితర వాటిని ఆదా చేయాలని పిలుపునిచ్చారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే తాను ఎలక్ట్రిక్ వాహనంలో కార్యక్రమాలకు హాజరు కావడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ప్రధాని మోదీ పిలుపును పాటిస్తూ ముందుకెళ్లాలని చెప్పారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు సామాన్య ప్రజలపై భారం.

**- ఐఐహెచ్ఎఫ్ డబ్ల్యూ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ డా. కవిత రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 16:**




కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3 చొప్పున పెంచడం సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని డా. కవిత రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యాక ఇంధన ధరలను పెంచడం రాజకీయ లబ్ధి కోసమే చేసిన నిర్ణయంలా కనిపిస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. డీజిల్, పెట్రోల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు పెరిగి, దాని ప్రభావం నిత్యావసర సరుకుల ధరలపై పడుతుందని తెలిపారు.ఇప్పటికే పెరుగుతున్న ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలకు ఈ ధరల పెంపు మరింత భారంగా మారుతుందని పేర్కొన్నారు. రవాణా వ్యయాలు పెరగడంతో మార్కెట్‌లో అన్ని వస్తువుల ధరలు పెరిగే అవకాశముందని చెప్పారు.భవిష్యత్తులో ఇటువంటి నిర్ణయాలు తీసుకునే ముందు సామాన్య ప్రజల పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుతున్నామని డా. కవిత రెడ్డి తెలిపారు.

# ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేస్తాం: కె.కేశవరావు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలు, త్యాగాలను అధికారికంగా గుర్తించి వారికి తగిన గౌరవం కల్పిస్తామని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఛైర్మన్ కె.కేశవరావు చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు, త్యాగాలకు ప్రభుత్వ స్థాయిలో గౌరవం కల్పించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేశవరావు నివాసంలో ఆదివారం కమిటీ తొలి సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాములు నాయక్, ఉద్యమకారుడు మోతే శోభన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. కమిటీ భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ, అమలు చేయాల్సిన విధివిధానాలపై సమగ్ర చర్చ జరిపారు. ఉద్యమ సమయంలో అనేక మంది ప్రాణత్యాగాలు చేయగా, మరికొందరు శారీరక వైకల్యం పొందినట్లు సభ్యులు తెలిపారు.
ఉద్యమ చరిత్రను సంరక్షిస్తూ, ఉద్యమకారుల త్యాగాలను భావితరాలకు చాటిచెప్పే దిశగా కమిటీ పనిచేస్తుందని సభ్యులు తెలిపారు.

# గిరిజన గురుకుల కళాశాలలకు "సత్యశోధక్" విద్యార్థుల ఎంపిక.



కే. రోహిత్



పి. నవ్య శ్రీ



డి. శ్రీజ



పి. సిద్దార్థ్

**వేగుచుక్క న్యూస్, సిరికొండ:**

తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ నివాస విద్యా సంస్థల సంఘం ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఇంటర్మీడియట్ ప్రవేశం కొరకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సత్యశోధక్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపిక అయ్యారు. విద్యార్థులు కె.రోహిత్, పి. నవ్య శ్రీ, డి. శ్రీజ, పి. సిద్దార్థ్ లు ఎంపిక అయ్యారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఇంటర్మీడియట్ కళాశాలలలో ప్రవేశ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ ఐ.ఐ.టీ స్టడీ సెంటర్ కళాశాలకు కె. రోహిత్, వరంగల్ జిల్లా పెద్దమ్మగడ్డ గిరిజన కళాశాలకు పి. నవ్య శ్రీ, వికారాబాద్ జిల్లా పరిగి గిరిజన కళాశాలకు డి. శ్రీజ మరియు వరంగల్ జిల్లా యాకుబ్ పురా గిరిజన కళాశాలకు పి. సిద్దార్థ్ లు ఎంపికైనారు.విద్యార్థులు సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ గిరిజన గురుకుల కళాశాలలకు ఎంపికకావడం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించుటకు ఉన్నత చదువులను పట్టుదల, క్రమశిక్షణతో చదవడం అత్యంత అవసరమని, విద్యార్థులు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకొని అంకితభావంతో కృషి చేయాలని ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య విద్యార్థులకు సూచించారు.

# 3 గంటల్లో హైదరాబాద్-ముంబయి



హైదరాబాద్హైదరాబాద్ నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరానికి ప్రస్తుతం రోడ్డు మార్గంలో అయితే సుమారు 12 గంటలు..రైల్లో అయితే దాదాపు 15 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైల్లో గంటకు గరిష్ఠంగా 300 కిమీ వేగంతో కేవలం మూడు గంటల్లో చేరుకునేలా హైదరాబాద్-పుణె-ముంబయి హైస్పీడ్ రైలు కారిడార్ ప్రణాళికలు తయారయ్యాయి. ఇప్పటికే సర్వే పూర్తి కాగా, తాజాగా డీపీఆర్ కూడా సిద్ధం అయిందని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్) రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా తెలిపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక బుల్లెట్ (హైస్పీడ్) రైల్లో హైదరాబాద్ నుంచి ముంబయికి కనిష్ఠంగా 2.55 గంటలు, గరిష్ఠంగా 3.13 గంటల్లో చేరుకోవచ్చని పేర్కొంది. ఈ ప్రాజెక్టులో మరో ఆసక్తికరమైన అంశం ఉంది. మహారాష్ట్ర పరిధిలోని మూడు ప్రాంతాల్లో మొత్తం 35.30 కిమీ మేర భూగర్భ మార్గం నిర్మిస్తారు. ఈ కారిడార్‌లోని ఖండాల ఘాట్ ప్రాంతంలో మొత్తం 13 చోట్ల కొండల్ని తొలిచి సొరంగాల నిర్మాణం చేపడతారు. మొత్తం దూరం 24 కిలోమీటర్లు. హైదరాబాద్‌లో మెట్రో రైలు కోసం పిల్లర్లపై నిర్మించిన ట్రాక్ మాదిరిగా హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణం ఉంటుంది. కొండ ప్రాంతాలు, భూగర్భంలో, నదుల మీదుగా నిర్మాణానికి ప్రతిపాదించిన ఈ హైస్పీడ్ రైలు కారిడార్‌లో అనేక విశేషాలున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాల పరిధిలో 7 హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టుల్ని ప్రకటించగా.. ఇందులో 3 హైదరాబాద్ నుంచి ఉన్నాయి. హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు సర్వే దశలో ఉండగా హైదరాబాద్-పుణె-ముంబయి ప్రాజెక్టు సర్వే పూర్తి కావడంతోపాటు డీపీఆర్‌ను సైతం ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ సిద్ధం చేసింది. ఈ కారిడార్ మొత్తం దూరం 671 కిమీ. ఇందులో 93 కిమీ (14 శాతం)తెలంగాణలో, 121 కిమీ (18 శాతం) కర్ణాటకలో, అత్యధికంగా 457 కిమీ (68 శాతం) మహారాష్ట్రలో ఉంటుంది.







# ప్లే ఆఫ్స్‌కు ఆర్సీబీ..

## పంజాబ్‌కు వరుసగా ఆరో ఓటమి

**ధర్మశాల:** ఐపీఎల్ 2026లో ఆర్సీబీ ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 223 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన పంజాబ్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసింది. శశాంక్ సింగ్ 56, స్టాయినిస్ 37, కనోలి 37, సూర్యాంశ్ 35 రన్స్ చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ 2, సలామ్ దార్ 3 వికెట్లు పడగొట్టారు. హేజిల్‌వుడ్, సుయాశ్ శర్మ, రొమారియో షెఫర్డ్ తలో వికెట్ తీశారు. వరుసగా ఆరో ఓటమి చవిచూసిన పంజాబ్ ప్లే ఆఫ్స్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది. ఇప్పటివరకు 13 మ్యాచ్‌లు ఆడి 13 పాయింట్లతో ఉన్న పంజాబ్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచినా ముందంజ వేస్తుందని కచ్చితంగా చెప్పలేం.తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. ఓపెనర్ జాకబ్ బెతెల్ (11) నిరాశపర్చినా.. వెంకటేశ్ అయ్యర్ (73; 40 బంతులలో 8 ఫోర్లు, 4 సిక్సులు), విరాట్ కోహ్లి (58; 37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. దేవ్‌దత్ పడిక్కల్ (45; 25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు), టిమ్ డేవిడ్ (28; 12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) మెరుపులు మెరిపించారు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ 2, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.


# రాజస్థాన్ రాయల్స్‌కు హ్యాట్రిక్ ఓటమి

## దిల్లీ ప్లేఆఫ్స్ ఆశలు సజీవం

దిల్లీ: ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్‌కు హ్యాట్రిక్ ఓటమి. రియాన్ పరాగ్ సేనపై దిల్లీ క్యాపిటల్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 8 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని దిల్లీ 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కేఎల్ రాహుల్ (56; 42 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు), అభిషేక్ పొరెల్ (51; 21 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించారు. అక్షర్ పటేల్ (34; 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), అశుతోష్ శర్మ (18; 5 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు) జట్టును విజయతీరాలకు చేర్చారు. ట్రిస్టన్ స్టబ్స్ (4), డేవిడ్ మిల్లర్ (9), సాహిల్ పరాఖ్ (9) నిరాశపర్చారు. రాజస్థాన్ బౌలర్లలో ఆర్చర్ 2, బ్రిజేష్ శర్మ 2, దాసున్ శనక ఒక వికెట్ తీశారు. రాజస్థాన్ బ్యాటర్లలో రియాన్ పరాగ్ (51; 26 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సులు), ధ్రువ్ జురెల్ (53; 40 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధ శతకాలతో మెరిశారు. వైభవ్ సూర్యవంశీ (46; 21 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించాడు. యశస్వి జైస్వాల్ (12) తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. దిల్లీ బౌలర్లలో స్టార్క్ 4, ఎంగిడి 2, మాధమ్ తివారీ 2 వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో 12 పాయింట్లకు చేరుకున్న దిల్లీ సాంకేతికంగా ఇంకా ప్లే ఆఫ్స్ రేసులో ఉంది. లీగ్ దశలో మరో మ్యాచ్ ఆడాల్సింది. ప్రస్తుతం 12 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్ చేరాలంటే తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాలి. ఇతర జట్ల ఫలితాలు కూడా కలిసొస్తేనే రాజస్థాన్ ముందంజ వేస్తుంది.








## గ్లామరస్ లుక్‌లో నయనతార

లేడీ సూపర్ స్టార్ నయనతార గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. కోలీవుడ్ చిత్రాల ద్వారా కెరీర్ ప్రారంభించిన ఈమె ఆ తర్వాత తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి రెండు భాషల్లోనూ స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ఇప్పటికీ కూడా నయన్ వరుస సినిమాలతో బిజీగా ఉంటూ తిరుగులేని నటిగా కెరీర్‌ను కొనసాగిస్తోంది. ప్రస్తుతం తమిళ్, తెలుగు చిత్రాలతో పాటు హిందీ సినిమాల్లో కూడా నటిస్తోంది. వయసు పెరిగినా నయనతార అందంలో మాత్రం ఏమాత్రం తగ్గుదల కనిపించడం లేదు. కుర్ర హీరోయిన్లకు పోటీగా గ్లామర్‌ను మెయింటైన్ చేస్తూనే అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అందుకే ఈమెకు వరుసగా క్రేజీ ప్రాజెక్ట్‌లలో అవకాశాలు దక్కుతున్నాయి. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ అప్పుడప్పుడు తనకు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. తాజాగా నయన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. వాటిలో వైట్ అండ్ బ్లాక్ కాంబినేషన్‌లో ఉన్న స్లీవ్‌లెస్ డ్రెస్ ధరించి స్టైలిష్ లుక్‌లో కనిపించింది. హెయిర్‌ను అందంగా ముడివేసుకొని ఇచ్చిన పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మొత్తంగా ఈ ఫోటోలలో నయన్ స్టైలిష్ అండ్ గ్లామరస్ లుక్‌లో కనిపించడంతో ప్రస్తుతం ఆ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## మానసికంగా ఎదురుదెబ్బ తిన్నా

'మహానటి' సినిమాతో యావత్ భారతదేశాన్ని తన నటనతో మంత్రముగ్ధులను చేసి జాతీయ అవార్డు గెలుచుకున్న నటి కీర్తి సురేష్ ఆ తర్వాత ఎన్నో చిత్రాల్లో నటించింది. కెరీర్ తొలినాళ్లలో కాస్త బొద్దుగా ఉన్న కీర్తి.. ఇటీవల కొంత జీరో సైజ్ లుక్‌లో మారిపోయింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. అయితే గత కొంతకాలంగా ఆమె లుక్‌పై సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ నడుస్తోంది. బొద్దుగా ఉన్న కీర్తి ఒక్కసారిగా జీరో సైజ్ లుక్‌లోకి మారడంతో.. ఆమె అందం కోసం లైపోసక్షన్, బేరియాట్రిక్ వంటి సర్జరీలు చేయించుకుందంటూ నెట్టింట పుకార్లు షికార్లు చేశాయి. ఈ రూమర్లపై ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న కీర్తి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టి ట్రోలర్ల నోళ్లు మూయించింది. తన బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ వెనుక ఉన్న అసలైన కష్టాన్ని, కన్నీళ్లను ప్రపంచానికి పరిచయం చేసింది. తాను బరువు తగ్గడం వెనుక ఉన్న కష్టాన్ని వివరిస్తూ, 2018లో 'మహానటి' సినిమా తర్వాత హై-ప్రోటీన్, లో-కార్బ్ ఫుడ్‌తో పాటు విపరీతమైన వర్కవుట్స్ హెచ్ఐటీ, కార్డియో వ్యాయామాలు చేసి 9 నెలల్లో 10 కిలోలు తగ్గానని కీర్తి చెప్పింది. ఆ సమయంలో తను చాలా గర్వంగా ఫీల్ అయ్యానని, కానీ జనాలు మాత్రం తను సర్జరీలు చేయించుకుందని అనడం చూసి బాధ కలిగిందని పేర్కొంది. "నేను ఎప్పుడూ నా ముఖంతో సహా అన్నింటినీ సహజంగానే ఉంచుకున్నాను. నా కష్టమంతా ఒక కత్తి కింద నలిగిపోయిందన్న మాట వినగానే కొంచెం బాధేసింది" అంటూ సర్జరీ పుకార్లను పూర్తిగా కొట్టిపారేసింది. ఆ తర్వాత 2020లో తాను యోగా వైపు మళ్లానని, అది తనకు మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని కీర్తి తెలిపింది. ప్రస్తుతం తన ఫిట్‌నెస్ దినచర్యలో స్ట్రెంగ్త్ ట్రైనింగ్, యోగా, యానిమల్ ఫ్లో, కాలిస్థెనిక్స్ వంటివి భాగమయ్యాయని చెప్పింది. "మనం బొద్దుగా ఉంటే సన్నగా అవ్వాలంటారు, సన్నగా ఉంటే బొద్దుగా ఉండాల్సింది అంటారు.. ఈ ప్రపంచం ఎలా ఆలోచిస్తుందో అని ఒక్కోసారి ఆశ్చర్యమేస్తుంది" అంటూ ఫైర్ అయింది. గత కొన్ని నెలలుగా తాను శారీరకంగా, మానసికంగా కొంత ఎదురుదెబ్బను తిన్నానని, అందుకే అందుబాటులో లేను అని కీర్తి ఓపెన్ అయ్యింది. అయితే జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినా, విరామం తీసుకోవాల్సి వచ్చినా తీసుకుంటాను కానీ.. ఎప్పటికీ వదులుకోను అంటూ రాసుకొచ్చింది. కీర్తి సురేష్ పెట్టిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్



## కృతి శెట్టి గ్లామర్ ట్రీట్

ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె ఇప్పటివరకు అనేక తెలుగు సినిమాల్లో నటించి మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఈ మధ్యకాలంలో ఇతర భాషా చిత్రాల్లో నటించడంపైనా ఆసక్తి చూపుతోంది. కెరీర్ ప్రారంభమైనప్పటి నుంచే తన అందాల ఆరబోతతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తోంది. సినిమాల్లో మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా అదే స్థాయిలో గ్లామర్ ట్రీట్ ఇస్తూ అభిమానులను అలరిస్తోంది. ముఖ్యంగా తన బ్యాక్ అందాలతో యువతను బాగా ఆకర్షిస్తుంది. అనేక సందర్భాల్లో తన వెనుక అందాలు హైలైట్ అయ్యేలా ఫోటోలకు స్టిల్స్ ఇచ్చింది. అలాంటి ఫోటోలు సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయిన సందర్భాలు కూడా చాలానే ఉన్నాయి. ఈ బ్యూటీ ఫోటోషూట్‌లలో ఒకటి, రెండు ఫోటోలు తప్పనిసరిగా బ్యాక్ అందాలు హైలైట్ అయ్యేలా ఉండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. దీంతో ఆమె ఫోటోలకు మంచి క్రేజ్ ఏర్పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇలా కృతి శెట్టి తన గ్లామర్‌తో, ముఖ్యంగా బ్యాక్ లుక్‌తో పలుమార్లు యువత మనసు దోచుకుంది.